
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం : 26 : డిసెంబర్ : 2024



సోమశిలలో 71.983 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 71.983 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 3 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 1,550, ఉత్తరకాలువకు 650, కండలేరుకు 1200, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,100
3 శాతం జీఎస్టీతో	రూ.7,313
నవర (8 గ్రా)	రూ.58,504

గరిష్టం/కనిష్టం
24.2 /22.6

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం గాలిలో తేమ 97 శాతం ఉంది.

న్యూస్‌రీల్

చిరు జల్లులు.. చలితో గజగజ

నెల్లూరు (అర్బన్): నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో బుధవారం కూడా జిల్లా వ్యాప్తంగా చిరు జల్లులు కురిశాయి. మూడు రోజులుగా జిల్లాపై కారు మబ్బులు కమ్మేశాయి. ఈదురు గాలులు వీస్తున్నాయి. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, పసి పిల్లలు చలితో కూడిన వాతావరణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముమ్మరంగా సాగుతున్న వ్యవసాయ పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. నగరంతోపాటు గ్రామీణ రోడ్లు రొచ్చు, రొచ్చుగా మారాయి. దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మైపాడు, కొత్తకోడూరు, రామతీర్థం, ఇస్కపల్లి తదితర పలు ప్రాంతాల్లో సముద్రంలో 5 మీటర్ల వరకు అలలు ఎగసి పడుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మరో రెండు రోజులు కూడా జిల్లాలో తేలికపాటి జల్లులు, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

వీఆర్‌కు రాపూరు సీఐ విజయకృష్ణ

- నూతనంగా చిన్న సత్యనారాయణ నియామకం

సైదాపురం: రాపూరు సీఐ విజయకృష్ణను వీఆర్‌కు పంపుతూ బుధవారం అధికారికంగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో బాపట్ల జిల్లా ఎస్బీ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న చిన్న సత్యనారాయణను రాపూరు సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాధ్యతలు చేపట్టిన విజయకృష్ణ కొద్ది రోజుల్లోనే వీఆర్‌కు పంపడం గమనార్హం.

పేకాట స్థావరంపై దాడి

- రూ.1.58 లక్షలు స్వాధీనం



పోలీసుల అదుపులో జూదరులు

మనుబోలు: మండల పరిధిలోని వడ్లపూడి అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మనుబోలు పోలీసులు దాడులను బుధవారం చేపట్టారు. పేకాటాడుతున్న 16 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.1,57,940ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై శివరాకేష్ తెలిపారు. వడ్లపూడి సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాటాడుతున్నరనే సమాచారంతో వెంకటాచలం ఎస్సై, తమ సిబ్బందితో కలిసి దాడులు చేశామని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



జిల్లాలో బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు కోలాహలంగా జరుపుకున్నారు. ప్రధాన చర్చిల్లో ఫాదర్లు.. నెల్లూరు నగరంలో బిషప్ క్రీస్తు జనన వేడుకలను కళ్లకు కట్టినట్లు నిర్వహించారు. దైవ సందేశాలను భక్తులకు వివరించారు. ఆర్‌సీఎం చర్చిలో బిషప్ ఎండీ ప్రకాశం బాల ఏసును భక్తులకు చూపించారు. అనంతరం భక్తులకు ఆశీర్వాదాలు అందించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

అక్రమ గ్రావెల్ తవ్వకాలపై తమ్ముళ్ల మధ్య చిచ్చు

ఓ టీడీపీ నేత కనుసన్నల్లోనే గ్రావెల్ దందా

- అక్రమ మైనింగ్‌పై రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు
- అడ్డుకున్న వీఆర్వోను గంటల్లో బదిలీ చేయించిన వైనం
- పట్టుకున్న వాహనాలను మధ్యలోనే వదిలేసిన పోలీసులు
- గ్రావెల్ దోపిడీపై మెయిల్ ద్వారా లోకేశ్‌కు టీడీపీ నేత ఫిర్యాదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లిలో టీడీపీ నేతలు బరితెగించి సహజ వనరులను దోచుకుంటున్నారు. షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో ఓ నేత చేస్తున్న గ్రావెల్ దందా మితిమీరింది. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై టీడీపీ నేతలే రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. వాహనాలను పట్టుకున్న పోలీసులను బెదిరించి వదిలించుకుని వెళ్లారు. అడ్డుకున్న వీఆర్వోను గంటల వ్యవధిలోనే బదిలీ చేయించారు. టీడీపీ నేతలు సాగిస్తున్న దందాపై సాక్షాత్తు ఓ టీడీపీ నేత జీ మెయిల్ ద్వారా నారా లోకేశ్‌కు.. అక్రమ మైనింగ్ చేస్తున్న ఫొటోను అటాచ్ చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు ఆ పార్టీలో చర్చనీయాంశమైంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నేతల అక్రమ నేతల మైనింగ్ తమ్ముళ్ల మధ్య రేగిన చిచ్చు.. ఆ పార్టీ నేతలు సాగిస్తున్న గ్రావెల్ దందాకు అద్దం పడుతోంది. వెంకటాచలం మండలం సర్వేపల్లిలో గ్రావెల్ తవ్వకాలపై చాలా కాలంగా టీడీపీ నేతల మధ్య అత్యర్యుద్ధం జరుగుతోంది. సర్వేపల్లి షాడో ఎమ్మెల్యేగా ఉన్న ఓ నాయకుడు అండతో స్థానికంగా ఉండే ఓ నేత మిగతా నేతలకు అవకాశం లేకుండా గ్రావెల్ తవ్వకాల దందా సాగిస్తున్నాడు. స్థానికంగా గ్రావెల్ మైనింగ్‌ను అడ్డుకున్న వీఆర్వోను ఇక్కడి నుంచి గంటల వ్యవధిలో బదిలీ చేయించడాన్ని కూడా ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.

టీడీపీ నేతలే పోలీసులకు ఫిర్యాదు

వెంకటాచలం మండలంలోని సర్వేపల్లిలో ఎస్టీలకు చెందిన భూముల్లో సోమవారం రాత్రి నుంచి గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు కొందరు మంగళవారం రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించారు. వీఆర్వో మునిబాబు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అక్రమ తవ్వకాలను అడ్డుకుని టిప్పర్లను వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశాడు. అయితే ఈ విషయం తెలుసుకున్న గ్రావెల్ దందాకు అన్నీ తానై చేస్తున్న టీడీపీ నేత పోలీసులతో మాట్లాడి ఆ వాహనాలను



వెంటనే వెనక్కి పంపించేశాడు. దీంతో స్థానిక టీడీపీ నాయకులకు, పోలీసులకు వాగ్వాదం కూడా జరిగినట్లు సమాచారం. గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లను పోలీసులు మార్గమధ్యంలోనే వదిలేయడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

మండిపడుతున్న టీడీపీ నేతలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో గ్రావెల్ దందాను అన్నీ తానై సాగిస్తున్న టీడీపీ నేత తీరుపై స్థానిక టీడీపీ నాయకులు మండి పడుతున్నారు. గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న వీఆర్వో మునిబాబును వెంటనే సర్వేపల్లిలో లేకుండా గంటల వ్యవధిలో నెల్లూరురూరల్ నియోజకవర్గానికి బదిలీ చేయించారు. వీఆర్వో మునిబాబు వెంకటాచలం గ్రామానికి చెందిన టీడీపీ నేత మునుస్వామి కుమారుడు కావడంతో సదరు నేతపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సర్వేపల్లిలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న



మెయిల్ ద్వారా నారా లోకేశ్‌కు చేసిన ఫిర్యాదు

టీడీపీ నేతపై సర్వేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జీ మెయిల్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న టీడీపీ నేత తీరు నచ్చక భవిష్యత్‌లో జరిగే స్థానిక ఎన్నికలను తాము బహిష్కరిస్తామని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు విషయం గురించి అందరికీ తెలియడంతో నాయకుల మధ్య పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

సోమిరెడ్డీ.. దమ్మ్ముంటే నాతో పోరాడు



మాజీ జెడ్పీటీసీ మందల వెంకటశేషయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కాకాణి

- కక్ష సాధింపులకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదు
- తప్పుడు నాయకుడు మాటలు వినే పోలీసులకు శిక్ష తప్పదు
- రాజకీయంగా ఎదుర్కోలేక వెంకటశేషయ్యపై అక్రమ కేసు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి
- వెంకటశేషయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ

వెంకటాచలం: 'సోమిరెడ్డి అసమర్థుడు. రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేక.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇలాంటి నీచ రాజకీయాలు చేసే బఫూన్. ఇలాంటోడు చెప్పాడని పోలీసులు తప్పుడు పనులకు పాల్పడుతున్నాడు. రాజకీయంగా ఎదుగుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ నేత, మాజీ జెడ్పీటీసీ మందల వెంకటశేషయ్యను ఎదుర్కొనే శక్తి సోమిరెడ్డికి లేకపోవడంతోనే మహిళను అడ్డం పెట్టుకుని తప్పుడు కేసు నమోదు చేయించారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం కాకాణి వెంకటాచలంలోని వెంకటశేషయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కాకాణి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులపై అక్రమ కేసు నమోదు చేయించి జైలు పాలు చేసి కక్ష సాధింపులకు పాల్పడిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీలో చురుకైన నేతగా పేరు తెచ్చుకున్న వెంకటశేషయ్యను రాజకీయంగా ఎదుర్కొనలేక సోమిరెడ్డి అక్రమ కేసులు బనాయించాడని ఆరోపించారు. ఐదు సార్లు ఓటమికి కారణాలను వెతుక్కోకుండా వైఎస్సార్‌సీపీలో గట్టిగా పనిచేసే నాయకులపై అక్రమ కేసులు మోపడం, కొందరిని పోలీసులతో కొట్టించడం వంటి ఆలోచనలు సోమిరెడ్డి చేయడం సిగ్గు చేటన్నారు.

సీఐ సుబ్బారావు అవినీతి పరుడు

వెంకటాచలం సీఐ సుబ్బారావు జాతీయ రహదారిపై వెళ్లే వాహనాల వద్ద భారీ వసూళ్లకు పాల్పడుతున్నాడనే విషయాన్ని తాను స్వయంగా డీఎస్పీని కలిసి చెప్పడం జరిగిందన్నారు. తన అవినీతి, అక్రమాలకు సోమిరెడ్డి అండగా నిలువడం కోసమే ఆయన చెప్పిన ప్రతి పనిని సీఐ సుబ్బారావు చేస్తున్నారని ఆరోపించారు. వెంకటశేషయ్యపై నమోదు చేయించిన అక్రమ కేసుకు సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి వాటిని కోర్టులో పొందుపరిచారని చెప్పారు. వెంకటాచలంలోని పెంచలయ్య, వెంకటమ్మ ఈ నకిలీ డాక్యుమెంట్లు సీఐకు ఇచ్చారని ధ్రువీకరిస్తూ ఆర్ఐ రవికుమార్ సంతకం చేసిన పత్రాన్ని కోర్టులో పొందుపరచడం జరిగిందన్నారు. అయితే ఆర్ఐ రవికుమార్ వెంకటాచలం రాకుండానే తప్పుడు సంతకం పెట్టాడని, వెంకటాచలంలో సీసీ ఫుటేజ్‌లు ఓపెన్ చేసి విచారణ జరిపితే వాస్తవాలు తేలుతాయన్నారు.

న్యాయపోరాటం చేస్తాం

కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరిగే దాడులు, అక్రమ కేసులు, జైళ్లకు పంపడంపై న్యాయ పోరాటాలు చేస్తామని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు జరిగే అన్యాయాలపై ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా అండగా నిలవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కారణంగానే తాను ఈ స్థాయిలో ఉన్నానని, వారికి అండగా నిలవడం కోసమే పని చేస్తానన్నారు. మహిళలంటే తమ అధినేతకు, తమకు ఎంతో గౌరవమని చెప్పారు. అయితే అమాయక మహిళను అడ్డం పెట్టుకుని మాజీ జెడ్పీటీసీ వెంకటశేషయ్యను జైలుకు పంపడం దుర్మార్గమని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు చేసే పాపాలు.. భవిష్యత్‌లో శాపాలుగా మారుతాయని హెచ్చరించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందాననే అనుమానాలు జిల్లా ప్రజలకు కలుగుతున్నాయన్నారు. జిల్లా ఎస్పీ మౌనంగా ఉండడంతో ప్రతి స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలు ఎస్పీలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంకట శేషయ్యపై అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపడంతో అతని కుటుంబ సభ్యులు, సన్నిహితులు చాలా బాధపడుతున్నారని, అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వెంకటశేషయ్యకు జైలుకు పంపిన కేసులో భాగమైన ప్రతి ఒక్కరూ అంతకు రెండింతలు బాధపడేలా చేస్తామని హెచ్చరించారు. ఇలా జరగకపోతే తన పేరును మార్చుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, మందల పెంచలయ్య, అడపాల ఏడుకొండలు, వెలిబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఊరూరా బెల్టు షాపులు.. మద్యం పరవళ్లు

పర్మిషన్ ఉన్న షాపుల నుంచే మద్యం సరఫరా

- అయినా పెనాల్టీ లేదు, లైసెన్స్ రద్దూ లేదు
- క్వార్టర్‌పై రూ.50 వరకు అదనపు వసూళ్లు
- అధికార పార్టీ క్యాడరే సూత్రధారులు
- అక్రమార్కులపై నామమాత్రపు కేసులు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్, సివిల్ పోలీసులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న 22 మద్యం బాటిళ్లను కావలి ఎక్సైజ్ ఎస్సై దేవిక ఈ నెల 10న జలదంకిలో బెల్ట్ షాపు నిర్వాహకుడు బి.లక్ష్మీనారాయణ నుంచి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కానీ పట్టుబడిన మద్యం ఏ లైసెన్స్‌డ్ షాపునకు చెందినదో అధికారులకు తెలుసు. అయినా ఆ దుకాణంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కారణం అది అధికార పార్టీ నేతల అండదండలతో నిర్వహిస్తుండమే.



ఉదయగిరి : బెల్ట్ షాపుల్లో పట్టుబడిన మద్యం ఏ దుకాణమో గుర్తిస్తే మొదటసారి అయితే రూ.2 లక్షలు జరిమాన విధిస్తాం. రెండోసారి జరిగితే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు మీడియా ముందు ప్రకటించారు. కానీ మూడు నెలల్లో జిల్లాలో దాదాపు 350 కేసులు నమోదైతే ఒక్క షాపునకు జరిమానా విధించడంగానీ, లైసెన్స్ రద్దు చేయడం కానీ జరగలేదు. ఈ షాపులన్నీ అధికార పార్టీకి చెందిన వారివి కావడమే. చంద్రబాబు చెప్పే మాటలకు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పొంతనే లేదని అర్థమవుతోంది. అధికార పార్టీ నేతలే ప్రభుత్వ మద్యం షాపులకు అనుబంధంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అధిక రేట్లకు విక్రయాలు చేస్తున్నారు. ఒక్కొక్క క్వార్టర్ బాటిల్‌పై రూ.50 వరకు అధికంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్సైజ్ అధికారులు అడపాదడపా దాడులు జరిపి ఆ శాఖ ఉనికి కోసం అరకొరగా కేసులు నమోదు చేస్తున్నారు. వ్యాపారంలో కూటమికి చెందిన గ్రామస్థాయి నేత నుంచి ఎమ్మెల్యేల వరకు ఉన్నారు. దీంతో వారికి మూడు సీసాలు.. ఆరు గాజులు మాదిరిగా సిరులు కురుస్తున్నాయి. ప్రతి పల్లెలో మూడు నుంచి పది వరకు బెల్ట్ దుకాణాలను నడుపుతున్నారు. కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రైవేటుపరం చేయడంతో జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. గతంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయాలు సాగేవి. జిల్లాలో 80శాతం దుకాణాలు కూటమి నేతలే దక్కించుకున్నారు. ఇప్పుడు వారంతా నిబంధనలు గాలికి వదలి తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం అనుమతి పొందిన షాపుల నుంచి మద్యం సరఫరా చేస్తూ బెల్ట్ దుకాణాలు ప్రోత్సహిస్తున్నారు. పల్లెల్లో కూడా వీధి వీధికి మద్యం షాపులు దర్శనం ఇస్తున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో 21 లైసెన్స్‌డ్ షాపులు ఉండగా, 320 వరకు బెల్టు దుకాణాలు ఉన్నట్లు అంచనా.



జేబులకు చిల్లు

మద్యం షాపుల వద్దకు వచ్చి కొనుగోలు చేయలేని వారు గ్రామాల్లో ఉండే బెల్టు షాపుల నుంచి అధిక ధరలకు కొంటున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.80 వరకు ఎక్కువకు విక్రయిస్తున్నారు. దుకాణంలో ఒక వ్యక్తికి కేవలం మూడు బాటిల్స్ మాత్రమే విక్రయించాలి. షాపుల వద్ద కూడా తాగడానికి వీల్లేదు. కానీ మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూములు వెలిశాయి. ఇక్కడే అన్నీ జరుగుతున్నాయి.

బెల్ట్ నిర్వాహకులపై ఒత్తిడి

మద్యం షాపులు దక్కించుకున్న వారి మధ్య సయోధ్య కుదరడలేదు. దీంతో పోటీ పడుతూ బెల్ట్ దుకాణాల నిర్వాహకులను రాబట్టుకుంటున్నారు. గ్రామాల్లో ఎవరికి వారు తమకు సన్నిహితంగా ఉండే వారిని ఉపయోగించి బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఫోన్లు చేస్తూ తమ వద్ద సరుకు కొనాలంటూ ఒత్తిడి తెస్తు న్నారు. కొన్ని షాపుల యజమానులు వాహనాల ద్వారా గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. వారు అధిక ధరలకు వాటిని అమ్ముతూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు



ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం విక్రయాలు జరగాలి. గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయాలు అక్రమంగా సాగిస్తే చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అక్రమ మద్యం సరఫరా, బెల్టు షాపులు నిర్వహిస్తే సహించేది లేదు. ఇప్పటికే గ్రామాల్లో నిఘా కూడా పెంచాం.

– లక్ష్మణ్‌స్వామి, ఎక్సైజ్ సీఐ, ఉదయగిరి

ఆర్టీసీ బస్సులో 12 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్

నెల్లూరు సిటీ: ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పట్టుకుని, వారి నుంచి 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. విజయవాడ విద్యాధరపురం డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్ విజయవాడ నుంచి తిరుపతి వైపు వెళ్తోంది. బస్సులో తనిఖీలు చేయగా అనుమానం వచ్చి ఓ సంచిని పరిశీలించారు. అందులో 12 కేజీల ఆరు ప్యాకెట్ల గంజాయిని గుర్తించారు. గంజాయి అక్రమంగా తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం తిరుచరాపల్లి జిల్లాకు చెందిన ఇలావరసన్, తమిళనాడు నమక్కల్ జిల్లాకు చెందిన రాగుల్ ధవకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

సేలంకు తరలిస్తుండగా..

తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో గంజాయిని అధిక ధరలకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు నిందితులు తెలిపారు. విశాఖపట్నం జిల్లా చోడవరంలోని గోవింద్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశామన్నారు. నెల్లూరు 1 ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ జేకేవీఎన్ మురళీకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, కానిస్టేబుల్స్ అజీజ్‌బాషా, ఎస్‌కే రఫీ, ఎం.రాజాజీ తదితరులు పాల్గొన్నారు.



గంజాయి, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

క్లుప్తంగా

వాహనం ఢీకొని నక్క మృతి



ఆత్మకూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో నక్క మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని వెంకట్రావుపల్లి అడ్డరోడ్డు సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారి పక్కన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పరిశీలించిన వాహనదారులు దీనిపై అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఆత్మకూరు రేంజ్ పరిధిలోని రాజవోలు ఫారెస్ట్ బీట్ ఉద్యోగి దొరసానమ్మ దీన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. వారి సూచనలతో పశుసంవర్థక శాఖ సిబ్బందితో పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం ఖననం చేశారు.

దర్జాగా కబ్జా



గ్రావెల్‌తో చదును చేసిన భూమి

ఆత్మకూరు: పట్టణ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ వద్ద ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు దర్జాగా కబ్జా చేసి రాత్రి వేళ గ్రావెల్ తోలి అప్పటికప్పుడే చదును చేస్తున్నారు. నెల్లూరుపాళెం సెంటర్ సమీపంలో ఆత్మకూరుకు వచ్చే రహదారి పక్కన ఐసీడీఎస్ కార్యాలయాల మధ్య ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఈ రకంగా కొల్లగొడుతున్నారు. ఇక్కడ స్థలాలకు డిమాండ్ ఉండటంతో ఈ తంతుకు పాల్పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైలు పట్టాలపై మహిళ మృతదేహం

బిట్రగుంట: బిట్రగుంట – అల్లూరు రోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ మార్గ పట్టాలపై గుర్తుతెలియని మహిళ (32) మృతదేహాన్ని రైల్వే పోలీసులు బుధవారం గుర్తించారు. మృతురాలు గోధుమ రంగు టాప్, తెలుపు, నీలి రంగుల్లో ఉన్న చున్నీ.. తెలుపు, ఎరుపు, నీలి రంగుల్లో ఉన్న ప్యాంట్‌ను ధరించి ఉన్నారని జీఆర్పీ ఎస్సై రమాదేవి తెలిపారు. రైల్లో నుంచి ప్రమాదవశాత్తూ జారిపడటంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

జిల్లా జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉమ్మడి నెల్లూరు జిల్లా క్యాడెట్ జట్లను శుక్రవారం ఎంపిక చేయనున్నామని ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాటూరు వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఐడీ కార్డు కలిగి, దాని జిరాక్స్ కాపీతో పాటు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత ఫెన్సింగ్ పరికరాలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు కాకినాడలో నిర్వహించనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ అండర్ – 17 బాలబాలికల ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు.

పశు'గణన' మాయ

- జీవాలు ఎక్కువగా ఉన్నాయని చూపించే యత్నం
- ఆన్‌లైన్లో నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలు
- పాడి పరిశ్రమ పెరిగిందని చాటేందుకు కుతంత్రం
- పూర్తి వివరాలు బయటకు రాకుండా అధికారుల జాగ్రత్తలు



పశుగణన చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): 'పశుగణనను నిర్వహిస్తున్నారు కదా.. జిల్లాలో పశువుల సంఖ్య పెరిగిందని ఆన్‌లైన్లో నమోదు చేయండి.. గతం కంటే తగ్గాయని ఎట్టి పరిస్థితుల్లోనూ రాయొద్దు' పశుసంవర్థక శాఖ ఉన్నతాధికారులు ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో చెప్పిన మాటలివి. దీంతో క్షేత్రస్థాయిలో జరుగుతున్న 21వ పశుగణన తీరుతెన్నులు మారిపోయాయి. కాకిలెక్కలు చేరిపోతున్నాయి. ఆన్‌లైన్లోనే కదా.. ఎంత లెక్క వేసినా ఎవరడుగుతారులే నంటూ సర్వేను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారనే ప్రచారం ఆ శాఖలో జరుగుతోంది.

ప్రస్తుత లెక్క..

పశుగణనను ఐదేళ్ల క్రితం నిర్వహించారు. ప్రస్తుతం 21వ అఖిల భారత పశుగణన అక్టోబర్ 25 నుంచి జిల్లాలో ప్రారంభమైంది. దీన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. గత లెక్కల ప్రకారం ఆవులు 57 వేలు, ఎద్దులు, గేదెలు దాదాపు 6.57 లక్షలు, గొర్రెలు 10.20 లక్షలు, మేకలు 3.6 లక్షలు, కుక్కలు 30 వేలు, మరికొన్ని జీవాలు కలిపి 21 లక్షలకు పైగా ఉన్నాయి. వీటితో పాటు కోళ్లు, బాతులు ఇతర పక్షులు 15.88 లక్షలు ఉన్నాయని గుర్తించారు. అప్పట్లో 6,64,591 ఇళ్లలో పాడిపరిశ్రమ ఉందనే అంశం వెల్లడైంది. ప్రస్తుతం సర్వేను 3,43,876 ఇళ్లలో పూర్తి చేశామని అధికారులు వెల్లడిస్తున్నారు.

పెంచి చూపేందుకు..

16 రకాల మూగజీవాలను పశుగణనలో ప్రధానంగా తీసుకుంటారు. సర్వే కోసం నియమించిన సిబ్బంది గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు, ఆన్‌లైన్ నమోదవుతున్న వివరాలకు మధ్య తేడా ఉందని తెలుస్తోంది. ఉన్నతాధికారులే చెప్పారు కదా.. అని చాలామంది ఇష్టానుసారంగా లెక్కలు వేస్తున్నారని సమాచారం. పాడి పరిశ్రమను బాగా ప్రోత్సహించామని, అందుకే జీవాల సంఖ్య పెరిగిందని ప్రచారం చేసుకోవడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న యత్నాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో..

గతంలో ఎన్ని ఇళ్లలో పాడి పరిశ్రమ ఉందని గుర్తించారంటే.. : **6,64,591**

ఇప్పటికే సర్వే చేసిన ఇళ్లు : **3,43,876**

ఎంత చేసినా..

పశువుల సంఖ్య ఎక్కువగా చూపించినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. జీవాల సంఖ్య తక్కువగా ఉండటంతో కొన్నినెలలుగా ఉత్పత్తులూ అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీనికి ఉదాహరణే నేటి ధరలు. ఒక కోడిగుడ్డు ధర రూ.ఏడుకు పైమాటే. గతంలో కిలో మటన్ రూ.700 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.వెయ్యికి చేరింది. నాలుగు నెలల క్రితం నిత్యం 3.5 లక్షల లీటర్ల నుంచి నాలుగు లక్షల లీటర్ల వరకు పాల సేకరణ ఉండేది. అయితే ప్రస్తుతం 2.7 లక్షల లీటర్ల నుంచి 3.25 లక్షల లీటర్లలోపే ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో పశుగణనలో లెక్కలు ఎలా ఎక్కువ చేసి చూపాలని కొందరు అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్లో ఇప్పటి వరకు నమోదు చేసిన వివరాలు బయటకు పొక్కకుండా జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

పక్కాగా నిర్వహిస్తున్నాం

జిల్లాలో పశుగణనను పక్కాగా నిర్వహిస్తున్నాం. ఉన్నవి ఉన్నట్లునే నమోదు చేస్తున్నారు. పొరపాట్లు జరగకుండా చూస్తాం. ఇప్పటి వరకు 51 శాతం పూర్తయినట్లు తెలుస్తోంది. అంతా అయిపోయాకే పూర్తి వివరాలను తెలియజేస్తాం.

– రమేష్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు



కేక్ కట్ చేస్తున్న బిషప్, భారతి సిమెంట్స్ ప్రతినిధులు తదితరులు

నాయుడుపేట టౌన్: మతసామరస్యానికి ప్రతీకగా భారతి సిమెంట్స్ యాజమాన్య ప్రతినిధులు నిలుస్తున్నారని సౌతాంధ్ర లూథరన్ చర్చి బిషప్ రైట్ రెవరెండ్ మైకేల్ బెన్హర్ కొనియాడారు. పట్టణంలోని ఎస్‌ఏఎల్సీ చర్చి ఆవరణలో క్రిస్మస్ వేడుకలను భారతి సిమెంట్స్ కంపెనీ జిల్లా మేనేజర్ మల్లికార్జునరెడ్డి, టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి, బిషప్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ చేతుల మీదుగా భారీ కేక్‌ను కట్ చేయించి, క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు. క్రిస్మస్ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నామని తెలిపారు. అనంతరం భారతి సిమెంట్స్ పరిశ్రమకు సంబంధించిన క్యాలెండర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. పీసీసీ మాజీ చైర్మన్ ఆనందరావు, కళాచంద్ర, సండే స్కూల్ సూపరింటెండెంట్ ప్రేమ్‌చంద్, భారతి సిమెంట్స్ డీలర్ శైలేష్ ట్రేడర్స్ యజమాని కామిరెడ్డి అమరేంద్రరెడ్డి, విజయ గణపతి స్టీల్స్ అండ్ సిమెంట్స్ యాజమాని ఇరుగు భరత్, బాలాజీ ట్రేడర్స్ యాజమాని కరింబాయి చెంచయ్య మొదలియార్, బెన్హర్ తదితరులు పాల్గొన్నారు.

పొరుగు మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి

మర్రిపాడు: బస్సులో తరలిస్తున్న పొరుగు రాష్ట్ర మద్యాన్ని ఉదయగిరి ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఉదయగిరి ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణస్వామి వివరాల మేరకు.. మండలంలోని బ్రాహ్మణపల్లి టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలను నిర్వహిస్తున్న సమయంలో, ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో బెంగళూరు నుంచి ప్రకాశం జిల్లా సీఎస్‌పురానికి వెళ్తున్న శ్రీనివాసులురెడ్డి వద్ద 37 ఫుల్ మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. పండగల నేపథ్యంలో మద్యాన్ని బెంగళూరు నుంచి గ్రామానికి తీసుకెళ్తున్నారనే అంశం వెల్లడైందన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఒక్క మద్యం బాటిల్‌ను తీసుకొచ్చినా, కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



మాట్లాడుతున్న వెంకట్రావ్

ఉదయగిరి: గంజాయిని తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్న ముఠాను ఉదయగిరి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు వివరాలను సీఐ వెంకట్రావ్, ఎస్సై ఇంద్రసేనారెడ్డి వెల్లడించారు. ఉదయగిరి ప్రాంతంలో గంజాయి విక్రయాలు కొంతకాలంగా సాగుతున్నాయనే సమాచారంతో సర్కిల్ పరిధిలోని అన్ని స్టేషన్ల ఎస్సైల ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి నిఘాను ఉంచామని తెలిపారు. సీతారామపురం, ఉదయగిరి పరిధిలోని జాతీయ రహదారిపై గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారంతో మధ్యవర్తుల ద్వారా తాము, తహసీల్దార్ అక్కడికి చేరుకొని వరికుంటపాడు మండలం జీ కొండారెడ్డిపల్లికి చెందిన చిన్న కొండయ్య, ఉదయగిరిలోని స్టేట్ పేటకు చెందిన దాసరి సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారించి వీరి నుంచి 230 గ్రాముల గంజాయి ప్యాకెట్లతో పాటు రూ.1500ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. శ్రీశైలం, విశాఖపట్నం నుంచి భైరవకోన, సిద్ధేశ్వరం వచ్చే కొందరు వీటిని తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారనే అంశం ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు. వీరిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

నిమ్మ ధరలు



పెద్దవి:	రూ.29
సన్నవి:	రూ.20
పండ్లు:	రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.111
లేయర్	రూ.100
బ్రాయిలర్ చికెన్:	రూ.204
స్కిన్‌లెస్ చికెన్:	రూ.224
లేయర్ చికెన్:	రూ.170

టిప్పర్ ఢీకొని గేదెల మృత్యువాత



కలువాయి: మండలంలోని మాదన్నగారిపల్లి సమీపంలో గల జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరె వెంకటేశ్వర్లుకు చెందిన నాలుగు గేదెలు మృతి చెందాయి. గేదెలు రోడ్డుపై తెల్లవారుజామున వెళ్తుండగా, వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. దీంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రమాదానికి కారణమైన టిప్పర్ ఆగకుండా వెళ్లిపోయింది. గేదెల విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని, తన కుటుంబానికి అవే జీవనాధారమని బాధిత రైతు బోరున విలపించారు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర కలశాభిషేకం



పూజా కార్యక్రమాలు



శేవేలి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో కొలువైన అయ్యప్పస్వామికి హోమాలు, సహస్ర కలశాభిషేకం, క్షీరాభిషేకం, మహాగణపతి హోమం తదితరాలను బుధవారం విశేషంగా జరిపారు. భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉభయకర్తలుగా కుందా సూర్యనారాయణరెడ్డి, ప్రభావతి, కురుగొండ్ల రామకృష్ణ, సింధు, ఎల్లసిరి సరోజ, గంట రాజశేఖర్, లక్ష్మీరాజ్యం , హేమవెంకటసిద్ధూ వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, మోహన్‌రావు, విజయకుమార్, పావళ్ల ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

కోడి పందేలపై దాడులు

కావలి: తుమ్మలపెంట గ్రామ శివారు ప్రాంతాల్లో కోడి పందేలపై పోలీసులు దాడులను బుధవారం చేపట్టారు. కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సై తిరుమలరెడ్డి, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. కోడి పందేలు ఆడుతున్న ఐదుగుర్ని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.5,600, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. గ్రామాల్లో కోడి పందేలు, పేకాట తదితరాలను నిర్వహిస్తున్నారని తెలిస్తే తమకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీలు



మర్రిపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ సుజాత బుధవారం తనిఖీ చేశారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పనితీరును ఆరాతీశారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రాంతాల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ గోపీనాథ్‌కు సూచించారు. మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై అటవీ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

మళ్లీ.. రాకు సునామీ

- తీర ప్రాంతాలను వణికించిన జలప్రళయానికి 20 ఏళ్లు



ఉలవపాడు మండలం బట్టిసోమయ్యపాలెంలో కోర్టు ఉద్యోగులు నిర్మించిన సునామీ కాలనీ

ఉలవపాడు: 'సునామీ' ఈ పేరు వింటేనే తీర ప్రాంత గ్రామాలు వణికిపోతాయి. సరిగ్గా 20 ఏళ్ల క్రితం 2004 డిసెంబర్ 26న సునామీ పంజా విసిరింది. అందరూ ప్రశాంతంగా ఉన్న సమయంలో బంగాళాఖాతం నుంచి అలలు ఉవ్వెత్తున ఎగిసి పడి గ్రామాలపై పడిపోయాయి. తాటి చెట్టంత ఎత్తున ఎగిసి పడి తీరప్రాంత గ్రామాల్లోకి సముద్రపు నీరు చేరింది. ఈ సునామీ ధాటికి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 20 మంది, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 22 మంది మృతి చెందారు. మత్స్యకారులు ఈ సునామీ ధాటికి వణికిపోయారు. కళ్లెదుటే కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న పరిస్థితులు ఉన్నాయి. ఉప్పు కొఠారుల్లో పనికొచ్చిన వారు, సముద్ర స్నానానికి వచ్చిన వారు, వలలు అల్లుకుంటూ సముద్రం పక్కన పనిచేసుకుంటున్న వారు ఈ అలల తాకిడికి బలైపోయారు. ఈ ఘోర విపత్తు జరిగి 20 ఏళ్లు గడిచినా సునామీ అనే పదం వింటనే మత్స్యకారుల గుండెల్లో తీరని వేదన కనిపిస్తోంది. ఆ రోజు గురించి ఇప్పుడు తలచుకున్నా ఆ భయం అలానే ఉంది.

సత్వరమే స్పందించిన వైఎస్సార్

సునామీ వచ్చిన రెండు గంటల్లోపే అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రకాశం జిల్లాలోని ఊళ్లపాళెం గ్రామానికి వచ్చి మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అప్పట్లో ఆయన వెంటనే స్పందించి బాధిత ప్రాంతంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో అధికారులు సైతం అందుబాటులోకి రాలేదు. అక్కడి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు అమరేశ్వరరావును వైఎస్సార్ హెలికాప్టర్ దిగిన అనంతరం కారులో ఎక్కించుకొని బాధిత ప్రాంతానికి వచ్చారని ఊళ్లపాళెం కాలనీవాసులు చెప్తారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకుంది. వారికి మంచి గృహాలను నిర్మించి అందజేశారు. బ్యాంకుల ద్వారా రుణాలను అందించి మత్స్యకారులను మళ్లీ వేటకు సిద్ధం చేశారు. డిసెంబర్ నెల అంటేనే తుఫాన్లు, సునామీ అనే భయం వెంటాడుతోంది. మరోవైపు ఉలవపాడు మండల పరిధిలోని బట్టి సోమయ్యపాళెంలో సునామీ కాలనీ పేరుతో హైకోర్టు లాయర్లు, జడ్జిలు ఉచితంగా నిర్మించి ఇచ్చారు. రామాయపట్నంలో కాసా స్వచ్ఛంద సంస్థ గృహాలను నిర్మించి అందజేసింది.